కొత్త పెళ్ళికొడుకు చాపలు మార్చటం, ఆ అమ్మాయి చీపురుతో గది చిమ్మటం, నీళ్లు పట్టటం బిక్కు బిక్కుమంటూ ఒంటరిగా ఆ గదిలో తను మొదటిరాత్రి గడపటాన్ని ఊహించుకుంటే నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కాని తప్పదు - విప్లవ వివాహంలో యిలాటి కష్టాలెన్నిటినో సంతోషంతో స్వీకరించి ముందంజ వేయాలిసుంటుంది.

సంఘాన్ని ఎదిరించి పెళ్లి చేసుకున్నవారు వారి పడగ్గదిని వారే చీపురుతో శుభ్రం చేసుకోవాలి... ప్రేమించి పెళ్ళిచేసుకో అనేవారే కాని చేసేవారెవరూ తోడుండరు గనుక - సంఘాన్ని మరమ్మత్తు చేద్దామనుకునే వారెవరూ సంఘం నుంచి "ఫేవర్సు" పొందలేరు. పూలజడలూ, పట్టుచీరెలూ, ఒడ్డాణాలు, కాసులపేర్లు, గుర్రంమీదెక్కి ఊరేగింపు అవాలనుకునే వారెవరూ ప్రేమించి పెళ్లి చేసుకోగూడదు. ఏంచేతనంటే "ప్రేమ" మన వివాహాల్లో జనించదు గాక జనించదు. మన పెళ్లితంతు ప్రేమలకు వధ్యశిల. వివాహాన్ని సామరస్యంగా చూసి ప్రేమను భద్రంగా కాపాడుకోగలిగిన వారి దాంపత్యాలే విజయవంతమవుతాయి.

# సమ్మరోపాఖ్యానం

"ఏవండీ అంతా కులాసా?"
"ఆ ఏం కులాసా లెద్దురు"
"అదేవిటి అట్లా అంటున్నారు?"
"ఎండలండీ ఎండలు-"
"నిమ్మకాయ షర్బత్తులు తాగండి."
"ఆ ఏం నిమ్మకాయ పోనిస్తురూ-"
"షోడాల్తాగండి"
" ఆ ఏవిషోడాలు? అవీ వెచ్చగా వుంటాయ్"
"పోనీ కూల్డ్రింక్సులు తాగండి"
"కూల్డ్రింక్సులు మాత్రం తాగినంతసేపే నోరు చల్లబడేది - మళ్ళీ గొంతుకెండిపోవడమే."
"పోనీ మంచినీళ్ళు త్రాగండి".
"ఏం మంచినీళ్ళు. కూజాలోవి కూడా చల్లగా వుండటం లేదు."
"పోనీ కుండ కొనండి కుండ - కుండ."
"కుండలూ కూజాలూ కాపాడవండీ - ఎండలు - ఎండలు-"
"మజ్జిగ యింత ఉప్పేసుకుని త్రాగేస్తే ...."
"ఎన్నిమాట్లు త్రాగమంటారు?"

"పోనీ చిట్టుడుకు నీళ్లుతీసి గరిటెడు మజ్జిగ ఉప్పు నిమ్మకాయ రసం పిండుకుని తాగితేనో."

"లాభం లేదండీ-హ్వావీ లాభం లేదు."

"పళ్ళరసం - పోనీ రోజూ మధ్యాహ్నం రెండు బత్తాయిపళ్ళు పిండుకుని అందులో చక్కెర మిళాయించి పుచ్చుకోండి-"

"బత్తాయి పళ్ళా? రెండా- ఈ ఎండల్లో మీరేదో వేళాకోళం ఆడుతున్నారు."

"బంగినపల్లి మామిడిపళ్ళు నైసుగా చెక్కుతీసి లబ్లీగా ముక్కలు తరిగి ఐసులో పెట్టిచెంచాతో ఒక్కొక్కటే తింటూ వుంటే - అదేమిటి అలా తెల్ల మొహం వేస్తున్నారు?"

"ఐసు కోసం మామిడిపళ్ళ కోసం బజారుకెళ్ళేసరికి మొహం తిరిగి పడిపోరటండీ - ఎండలు-ఎండలు-హ్వావీ లాభంలేదు -"

"మరేం చేస్తారు?"

"హ్వావీ చెయ్యలేం. సూర్యనమస్కారాలు తప్ప-"

"గాభరాపడకండి - ఎండలకే గాభరాపడితే ఎల్లాగండి? రోహిణీకార్తె మరోటా?"

"రోహిణీకార్తే?"

"రోళ్ళు పగలవుటండీ?"

"పగుల్తాయ్ - పగుల్తాయ్."

"తొట్టిలో నీళ్ళు నింపి - నీళ్ళతొట్టి - నీళ్ళ తొట్టి -నీళ్ళ తొట్టి."

"అవును వినపడ్తోంది"

"అందులో కూర్చోండి నా మాట విని"

"బయటకు రాగానే వడగొట్టి పడిపోమూ?"

"నీళ్ళ తొట్టిలో వుండగా పడిపోయినా ఫరవాలేదు -"

"హ్వావీ లాభంలేదు - ఎంతసేపు కూర్చుంటాం అందులో?"

"అడ్జస్టు కావాలి మరి వాతావరణానికి."

"కావ్యాల్లో విరహతాపం అంటూ వుంటారు. అది ఈ బెజవాడెండల కంటె ఎక్కువా?"

"అయివుండదు. విరహతాపం ఏపాటిదయినా బెజవాడ ఎండల కంటే తక్కువే అయుంటుంది."

"విప్లవ కవిత్వం మాచెడ్డ హాట్‌గా వుంటుందంటారు. అదో?"

"అదికూడా బెజవాడ ఎండల ముందు తక్కువే-"

"రాష్ట్ర రాజకీయాలు హాట్‌గా వుంటాయంటారు-"

"అవీ బెజవాడ ఎండకు దిగదుడుపే-"

"పోనీ ఓ పనిచేయండి."

"ఏవిటది?"

"మంచి ప్రేమకథలు చదువుతూ తడిబట్ట కట్టుకు కూర్చోండి."

"ప్రేమకథలు చల్లగా వుంటాయా?"

"వుండకపోతే పుస్తకాన్ని నీళ్ళలో ముంచి పైకితీసి చదవండి చల్లగా వుంటుంది."

"నాన్సెన్స్."

"మరి ఈ ఎండల్లో పెళ్ళిళ్లు చేసుకునే వాళ్ళు –"

"వాళ్ళ ఖర్మం అడక్కండి – జావ జావ అయిపోతారు, ఉత్తర దక్షిణ ధృవాల్లా వుండాల్సిందే –"

"వర్షాలొస్తాయనుకుంటాను."

"ఎలా అనుకుంటారు?"

"రాకపోతే చచ్చిపోముటండీ?"

"కళ్లు మూసుకుని వర్షం వచ్చినట్లు వూహించుకుంటే చల్లగా వుంటుంది. గొడుగు పట్టుకు నడుస్తున్నట్లు – బురద మీ మీదకి చిమ్ముతూ కారు వెళ్లినట్లూ, తడసిపోయి రోడ్డుమీద పరుగెత్తుతున్నట్లూ – ఎక్కడ చూసినా నీళ్ళు నీళ్ళు నీళ్లు – చల్లగా గాలి – అబ్బ."

"వర్షాకాలంలో అబ్బ ఎండ వస్తుందా బాబూ–ఎండవస్తే బావుణ్ణు అనిపిస్తుందా – వర్షాకాలంలో వేడి వేడి పకోడీలు తినాలనీ, గరం గరం చాయ్ గరంగరంగా తాగాలనీ, హాట్ హాట్‌గా వుండాలని అనిపిస్తుందా లేదా?"

"అనిపిస్తే –"

"వుండు, పేద వెధవకి ఎయిర్‌కండిషన్ గదులూ, సోఫాలూ, ఫానులూ, కేకులూ, కూల్‌డ్రింక్‌లూ, కారుల్లో మెత్తని సుఖాలూ, డన్‌లపు పరుపులూ, రూపాయి నోట్లకట్టలూ జ్ఞాపకం వచ్చి సుఖాన్ని కలిగిస్తాయి. వూహల్లో – వున్న వాడి సుఖం అంతా లేనివాడు దాన్ని గురించి వూహించుకొనే పరిస్థితుల్లో వాడ్ని వుంచడంలోనే వుంది. అలాగే సమ్మరూ వింటరూ వగైరాలూ–?"

"ఒప్పుగున్నాం – కంటిన్యూ–?"

"నన్నడిగితే ఎండల్లో వర్షాకాలం గురించి వూహించుకోవాలి అలాగే వైస్ వెర్సా – శీతాకాలంలో వసంతకాలం గురించి వూహించుకోవాలి–"

"ఆల్‌రైట్ ప్రొసీడు."

"ఋతువుల మీద ఆగ్రహం కలగకుండా మంచి అభిప్రాయం కలగాలంటే మనం వుంటున్న ఋతువుని వదిలేసి మిగతా ఋతువుల గురించి ఆలోచించాలి."

"సరే – ఇదో ఎస్కేపిజం"

"బాబోయ్ ఎండలు అని సూర్యుడ్ని తిట్టుకుంటూ ఏడుస్తూ ఎందుకుండటం – కనుక వింటర్ని పొగుడుతూ పజ్యాలు రాయి. వర్షాన్ని ఆహ్వానిస్తూ కందపద్యాలు రాసీ –"

"వున్నదాన్నొదిలేసి లేనిదాన్ని పట్టుకో మంటావు."

"అంటంలేదు. ఏడవొద్దు అంటున్నాను".

"ఈ ఎండలు యీ మంటలు యీ దాహం ఈ చిరాకు ఈతాపం నుంచి రక్షించమంటున్నాను."

"ఇవి లేవు అనుకోవటమే దీని నుంచి రక్షణ."

"షటప్"

"షటప్ కాదు. 1982లో 128 డిగ్రీల వేడి వుంటుందనుకో - ఇప్పుడు 1972లో 115 డిగ్రీలో 118 డిగ్రీలో వుంది గనుక అప్పుడు నేను వుండను కదా అని ఆ ప్రభువుకి మోకాళ్ళమీద ఆని కృతజ్ఞతలు చెప్పుకోవాలి."

"1990లో అగ్గిపెట్టె రూపాయి వుంటుంది. కాబట్టి 1972లో సుఖంగా వున్నామని నమ్మమంటావు."

"అంతే- అంతే-"

"ఏవండీ కులాసా?"

"ఆహా అంతా కులాసా?"

"ఎండలెలా వున్నాయ్!"

"మామూలే"

"జాగ్రత్తగా వుండండి"

"హా ఏం జాగ్రత్తా -?"

"వీధిలో తిరక్కండి. ఇంట్లో వుండండి."

"ఇంట్లో వున్నవాళ్ళు మటుకు పోటంలా-"

"ఆసంగతి కాదు నేన్చెప్పేది?"

"... ... ... ..."

"మాట్లాడరేం?"

"... .... ... ...."

"ఎండ దెబ్బ కొట్టిందా!"

"... ... .... ..."

# నీళ్ళ కోసం నిప్పుల పాట

మురికి పేటలకు, కుళ్ళు కాలవలకు, దోమలకు పెంట కుప్పలకు బురద, పందులకు, పిచ్చి కుక్కలకు, గుడిసెలకు - గుప్తధనానికి, రంగు వేషాలకూ, రాజకీయాలకూ, దుర్గంధానికి కొండమీది దేవుళ్ళకూ - కొండ క్రింది రాక్షసులకూ, అల్ట్రామోడ్రన్ ఫామిలీస్కూ - అడుక్కుతినే అలగాజనానికీ, ముష్టివాళ్ళకూ - ముష్కరులకూ, దొంగలకూ, దోపిడీదారులకూ